క్లుప్తంగా

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

పెద్దేముల్: పటేల్ వీరశెట్టి మెమోరియల్ ఆధ్వర్యంలో ఇందూరులో బుధవారం నుంచి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం జరుగుతుందని ఇందూరు ఎంపీటీసీ సభ్యుడు ప్రవీణ్‌పటేల్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రీడా పోటీల్లో ఎవరైనా పాల్గొనవచ్చని చెప్పారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.50 వేలు, రెండవ బహుమతిగా రూ.25 వేలతో పాటు జ్ఞాపికలు అందజేస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం 85550 47566, 97051 88300 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

నూతన కమిటీ నియామకం

మోమిన్‌పేట: మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షురాలుగా మాధవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతనంగా ఎన్నికైన ప్రధాన కార్యదర్శి వెంకటయ్య మంగళవారం తెలిపారు. ఉపాధ్యక్షులుగా వెంకటేశ్వర్‌రెడ్డి, సుమిత్ర, కోశాధికారిగా సుగుణ, ప్రచార కార్యదర్శిగా తిరుపతమ్మ, కార్యవర్గ సభ్యులుగా ప్రవీణ్‌కుమార్, ఇందిర, విక్రంరెడ్డి, నర్సింహులు, రజిత, వీణ, ప్రేమ్‌కుమార్, బాలరాజ్‌ను ఎన్నుకున్నట్లు ఆయన చెప్పారు.

ఉన్నత చదువులకు చేయూత



మీనాక్షి కుటుంబీకులకు చెక్కు అందచేస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి

పెద్దేముల్: చదువుకోవాలని ఆసక్తి ఉన్న ఆ చదువుల తల్లికి ఆర్థిక కష్టాలు వెంటాడాయి. దీంతో తల్లికి సాయంగా పొలం పనుల్లో బిజీ మారింది. విషయం తెలుసుకున్న ఎంపీ రంజిత్‌రెడ్డి నేనున్నానంటూ చేయూతనందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గాజీపూర్ గ్రామానికి చెందిన మీనాక్షి.. తండ్రి మరణంతో చదువు మానేసి, పొలం పనులతో కాలం గడుపుతోంది. విషయం తెలుసుకున్న ఎంపీ.. చదువుకోవాలంటూ వారి కుటుంబ సభ్యులకు మంగళవారం తక్షణ సాయంగా రూ.45వేలు అందచేశారు. ఉన్నత చదువులకు అయ్యే ఖర్చునంతా తానే భరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో ఎంపీకి మీనాక్షి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం ఉపాధ్యక్షుడు వెంకటేశ్ చారీ ఉన్నారు.

'కంటివెలుగు' దేశానికి ఆదర్శం



నేత్ర శిబిరాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌కుమార్

పరిగి: కంటివెలుగు కార్యక్రమం ఎన్నో కుటుంబాల్లో వెలుగు నింపిందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని 7వ వార్డులో రెండో విడత కంటివెలుగును ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేత్ర శిబిరాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కంటివెలుగు దేశానికే ఆదర్శమని, కార్యక్రమం ద్వారా అనేక మందికి కంటి సమస్య తీరిందని తెలిపారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సంతోష్, నాయకులు మల్లేశ్, నర్సింహులు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రను అడ్డుకునేందుకు కుట్ర



మాట్లాడుతున్న బాలరాజ్

కొడంగల్: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి షర్మిల చేస్తున్న పాదయాత్రను అడ్డుకోవడానికి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు కుట్ర చేస్తున్నారని వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ కొడంగల్ నియోజక వర్గ ఇన్‌చార్జి తమ్మలి బాలరాజ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిలు టీఆర్‌ఎస్ నేతలపై ఎన్ని ఆరోపణలు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. వైఎస్ఆర్ తెలంగాణ పార్టీకి రాష్ట్రంలో ఆదరణ పెరుగుతుందని గ్రహించిన బీఆర్‌ఎస్ నేతలు షర్మిల పాదయాత్రను అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పాదయాత్రకు వెంటనే అనుమతి ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా తమ పార్టీ కార్యకర్తలు ఆందోళన చేస్తారని హెచ్చరించారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం..

కుల్కచర్ల: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మంగళవారం చౌడాపూర్ మండల పరిధిలోని మందిపల్ గ్రామానికి చెందిన ఉప సర్పంచ్ సునితాబాలరాజ్ కుటుంబీకులు అంజిలమ్మ మృతి చెందడంతో ఆమె అంత్యక్రియల్లో పాల్గొని, బాధిత కుటుంబీకులను పరామర్శించారు.

అన్నదాత సుఖీభవ

అన్ని దానాల కంటే అన్నదానం గొప్పదంటారు. ఈ ఉరుకుల పరుగుల జీవితంలో సాటి మనిషికి సహాయం చేయాలనే సంకల్పంతో పలువురు యువ వ్యాపారులు నాలుగేళ్లుగా ఆకలితో అలమటిస్తున్న వారి ఆకలి తీరుస్తూ.. పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు.

- నలుగురితో ప్రారంభమై.. పదిమందికి ఆదర్శమై
- సేవ చేయడానికి స్వచ్ఛందంగా మరికొందరు
- నాలుగేళ్లుగా నిత్యం అన్నదానం



అన్నదానం చేస్తున్న యువకులు

వికారాబాద్ అర్బన్: వ్యాపారాలు, ఉద్యోగాల పేరుతో నిత్యం బిజీగా ఉండే వారిలో కొందరు.. వారంలో ఒక రోజు కొంత తీరిక చేసుకొని తమకు తోచిన సహాయం చేయాలనుకున్నారు. అన్నింటికంటే అన్నదానం ఎంతో మేలని, అనుకున్నదే తడవుగా నాలుగు ఏళ్ల క్రితం ప్రారంభించి.. ఎంతో మంది ఆకలి తీరుస్తూ.. మరెంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ యువ వ్యాపారులు. వికారాబాద్ పట్టణానికి చెందిన ఈ వ్యాపారులు నలుగురికి అన్నదానం చేయాలనే ఆలోచనతో నాలుగేళ్ల క్రితం పట్టణంలోని మల్లికార్జున దేవాలయం వద్ద అన్నదానానికి శ్రీకారం చుట్టారు.

విశేష స్పందన..

ఆ నలుగురు చేస్తున్న సేవ కాస్త పలువురికి ఆదర్శం కావడంతో.. మరికొంత మంది వారికి తోడయ్యారు. ఇలా పది మంది యువ వ్యాపారులు కలిసి ప్రతి సోమవారం సుమారు 200 మందికి అన్నదానం చేస్తున్నారు. వీరు చేస్తున్న కార్యక్రమానికి మిగతా వ్యాపారులు స్పందించి చేదోడుగా నిలుస్తున్నారు. రైల్వేస్టేషన్ చుట్టూ ఉండే వారితో పాటు, రోడ్డు పక్కన నివాసం ఉండే వారితో పాటు.. అనేక మంది ఈ ఉచిత భోజనాన్ని వినియోగించుకుంటున్నారు. కోవిడ్ సమయంలో అన్నదాన కార్యక్రమం చేయలేక పోయామని, గత ఏడాది కాలంగా అన్నదానం నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. కొందరు యువకులు అన్నదానానికి డబ్బు సహాయం చేయకపోయినా.. వంటలు వండటం నుంచి భోజనాలు వడ్డించే వరకు కార్యకర్తలుగా పనిచేయడం వారిలో ఉన్న సేవా భావాన్ని పలువురు అభినందిస్తున్నారు.

భోజనం పెట్టామనే తృప్తి



నాలుగు ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. కోవిడ్ సమయంలో చేయలేక పోయాం. తిరిగి ఏడాది కాలంగా చేస్తున్నాం. ప్రతి సోమవారం సుమారు 200మంది భోజనం చేస్తారు. ఆకలితో ఉన్నవారికి భోజనం పెట్టామనే తృప్తి మిగులుతుంది.

– సంతోష్, కార్యకర్త

ప్రతివారం పాల్గొంటా..



ప్రతివారం అన్నదాన కార్యక్రమంలో పాల్గొంటా. ప్రారంభం నుంచి చివరి వరకు ఉంటా.. ఎంత మంది వచ్చినా.. వారికి వడ్డించి సేవ చేస్తాను. ఇక్కడ అన్నదానం ఉంటుందని తెలిసి చాలా మంది వచ్చి భోజనం చేస్తారు.

– కోటి లింగాలు, కార్యకర్త

సైబర్ నేరాల పట్ల జాగ్రత్త

బషీరాబాద్ ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి

బషీరాబాద్: సైబర్ నేరాలపట్ల ప్రజలు కనీస అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంకులో ఖాతాదారులకు, రైల్వేస్టేషన్ దగ్గర ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రజలు తమ వ్యక్తిగత బ్యాంకింగ్ వివరాలను అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. ఫోన్‌లలో ఓటీపీ, ఓఎల్‌ఎక్స్, పేటీఎం, గూగుల్ పే, ఫోన్ పే, కేవైసీలను అప్‌డేట్ చేయమని వచ్చే మెసేజ్‌లకు స్పందించకూడదని తెలిపారు. సైబర్ నేరాలకు బారిన పడినప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. సైబర్ క్రైమ్‌కు గురైన వెంటనే ఫిర్యాదు చేస్తే డబ్బులు రికవరీ చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇటీవల కాలంలో మహిళలు, పిల్లలను టార్గెట్ చేసుకుని సైబర్ నేరాలు పెరుగుతున్నాయన్నారు. ఇంటర్నెట్‌ను పరిమితికి మించి వాడినా ప్రమాదమేనని హెచ్చరించారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా..

తాండూరు రూరల్: చెడు అలవాట్లకు దూరంగా ఉండి గ్రామంలో యువకులు ఆదర్శంగా ఉండాలని కరన్‌కోట్ ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి అన్నారు. చెంగోల్‌లో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవంలో ఎస్‌ఐ మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా కలిసి మెలసి ఉండాలని సూచించారు. సర్పంచు మల్లీశ్వరిగౌడ్, ఎంపీటీసీ రత్నమాల, ఆర్‌ఐ బాలరాజు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బషీరాబాద్: ఎస్‌బీఐలో ఖాతాదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి

చట్టానికి ఎవరూ అతీతులు కాదు

- సమాజంలో అందరూ సమానమనే భావన కలిగి ఉండాలి
- పౌర హక్కుల దినోత్సవంలో వక్తలు

యాలాల: గ్రామాల్లో శాంతిపూర్వక వాతావరణం ఉండేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్‌ఐ అరవింద్‌కుమార్ అన్నారు. దేవనూరులో నిర్వహించిన పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు కల్పించిందని, సామాన్యులు పౌరహక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుందని తెలిపారు. చట్టాలను తెలుసుకోవాలని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సమానమనే భావన కలిగి ఉండాలని, పౌరహక్కులపై అవగాహన కలిగి ఉన్నప్పుడే సమాజ మార్పునకు అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివకుమార్, ఎంపీటీసీ మంత్రి మొగులమ్మ, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ వీరానందం, ఆర్‌ఐ నారాయణరెడ్డి, పంచాయతీ కార్యదర్శి పావని, మెట్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో పనిచేయించడం నేరం



పెద్దేముల్: మాట్లాడుతున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్

పెద్దేముల్: కుల వివక్షత లేకుండా ప్రతి ఒక్కరు సమాన హక్కులు కలిగి ఉండాలని మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజిరెడ్డి అన్నారు. మంగళవారం బండమీదిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ తులసి అధ్యక్షతన 'పౌర హక్కుల దినోత్సవం' సందర్భంగా నిర్వహించిన సమాన హక్కులపై అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. చిన్నారులను పనిలో పెట్టుకొని వెట్టి చాకిరి చేయిస్తే చట్ట పరమైన చర్యలు ఉంటాయని, పిల్లలతో పనిచేయించడం నేరమని హెచ్చరించారు. పౌరులందరూ కుల వివక్ష లేకుండా సమాన హక్కులు కలిగిఉండాలని, తమ హక్కులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అధికారి రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, గ్రామ పెద్దలు రాంచంద్రయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాం సుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అగ్సర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ చెప్పేదొకటి, చేసేదొకటి

- దళితబంధుకు రూ.17వేల కోట్లంటూ.. 200 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం
- సాగు పరికరాలపై రాయితీ ఎత్తేసిన సర్కార్
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. రూ.500లకే గ్యాస్ బండ
- మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్



మహిళలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్ రూ.500లకే ఇస్తామని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ చెప్పారు. మంగళవారం మండల పరిధిలోని అంరాధికుర్దు గ్రామంలో హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆడపడుచులకు రాష్ట్ర ప్రభుత్వం వడ్డీలేని రుణాలను ఇవ్వడం లేదని, తమ పార్టీని ఆదరించి.. వడ్డీలేని రుణాలను పొందాలని చెప్పారు. ఈ ప్రభుత్వం చెప్పేదొకటి, చేసేదొకటని, గత బడ్జెట్‌లో దళితబంధుకు రూ.17వేల కోట్లు కేటాయించి, రూ.200కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆరోపించారు. రుణమాఫీకి అరకొర నిధులు వెచ్చిస్తూ.. రైతులను మోసం చేస్తుందని విమర్శించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణ మాఫీ చేస్తుందని స్పష్టం చేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా.. ఆ ఊసే లేదని, వ్యవసాయ పరికరాల రాయితీని పూర్తిగా ఎత్తివేసి బీఆర్‌ఎస్ ప్రభుత్వం చోద్యం చూస్తుందని ఎద్దేవా చేశారు. నిరుద్యోగ యువతకు గత బడ్జెట్‌లో నిధులు కేటాయించి, రూపాయి ఇవ్వలేదని, ఇస్తున్నామని చెప్పడమే తప్ప ఇచ్చింది లేదంటూ మండిపడ్డారు.

పాలమూరు–రంగారెడ్డిపై వివక్ష

రంగారెడ్డి, పాలమూరు జిల్లాలను సస్యశ్యామలం చేస్తామని, పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రారంభించి ఏళ్లు గడుస్తున్నా.. ఎక్కడ వేసిన గొంగడి అక్కడేనన్న చందంగా మారిందని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును నాలుగేళ్లలో పూర్తి చేశామంటున్న రాష్ట్ర ప్రభుత్వం.. మరి పాలమూరు–రంగారెడ్డిని ఎందుకు పూర్తి చేయడం లేదని, ఎందుకింత వివక్షని ప్రశ్నించారు. రానున్న ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని, కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మడల అధ్యక్షుడు శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిరాజొద్దీన్, నాయకులు మహేందర్‌రెడ్డి, శుభాష్‌గౌడ్, సురేందర్, చంద్రయ్య, మాణయ్య, వెంకటయ్య, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, బాబు, నర్సింహ్మారెడ్డి, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు దక్కడం హర్షణీయం



విజయప్రశాంత్‌ను సన్మానిస్తున్న బీఆర్ కృష్ణ

అనంతగిరి: తెలంగాణ వైద్య విధాన పరిషత్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బీసీ వర్గానికి చెందిన విజయ ప్రశాంత్‌ను నియమించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బీఆర్ కృష్ణ ముదిరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన హైదరాబాద్‌లో విజయప్రశాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఇది బీసీలకు దక్కడం హర్షించదగిన విషయమన్నారు. తెలంగాణ ఉద్యమంలో విజయప్రశాంత్ కీలకపాత్ర పోషించారని, న్యాయవాదుల జేఏసీలో ప్రధాన భూమిక పోషించారని తెలిపారు. కార్యక్రమంలో బీసీ యువ నాయకులు సాయితేజ, పలువురు యువకులు తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం

ధారూరు: మండల పరిధిలోని గురుదోట్ల గ్రామ పంచాయతీకి అనుబంధ తండాగా ఉన్న ఊరెనక తండాకు చెందిన గణేశ్, శివశంకర్‌లు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. వారి అంత్యక్రియల కోసం రూ.5 వేల చొప్పున మృతుల కుటుంబాలకు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షుడు హన్మంత్‌రెడ్డి మంగళవారం అందజేశారు.

మృతుడి కుటుంబానికి..

మోమిన్‌కలాన్ గ్రామానికి చెందిన యాదగిరి సోమవారం రాత్రి ద్విచక్ర వాహనం ఢీకొని మృతి చెందారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు వడ్లనందు మృతుడి కుటుంబీకులను పరామర్శించి, తన ఫౌండేషన్ తరఫున రూ.5 వేలు సాయం అందజేశారు.

అన్వర్‌ఖాన్‌కు అరుదైన అవకాశం



రాష్ట్ర క్రీడాకారులతో అన్వర్ హుస్సేన్

తాండూరు: అటవీ శాఖ రేంజ్ పరిధిలో సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అన్వర్ హుస్సేన్‌ఖాన్ జాతీయ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ప్రతిభ చాటారు. ఫిబ్రవరి 24వ తేది నుంచి 28వ వరకు ప్రభుత్వ ఉద్యోగులకు ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ చండీఘడ్‌లో జరిగాయి. కేంద్ర క్రీడల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో తెలంగాణ నుంచి వివిధ ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న 15 మంది ఉద్యోగులు ఆడేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. పోటీల్లో పాల్గొనేందుకు కావాల్సిన సదుపాయాలను సమకూర్చింది. అయితే వికారాబాద్ జిల్లా నుంచి అటవీ శాఖ పరిధిలో బషీరాబాద్ సెక్షన్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న అన్వర్‌కు జాతీయ స్థాయి పోటీలకు అవకాశం లభించింది. దీంతో పోటీల్లో ప్రతిభ కనబర్చారు. ఫైనల్ రెండవ రౌండ్‌లో ఓటమి చెందారు. అయితే మారుమూల ప్రాంతం నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో సత్తాచాటి, జాతీయ స్థాయిలో అన్వర్ ప్రతిభ చూపడంతో అటవీ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు ఇతర శాఖల ఉద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

తాండూరు టౌన్: విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు శిక్షణ ఫౌండేషన్ కృషి చేస్తుందని ఫౌండేషన్ రాష్ట్ర ఆపరేషన్ మేనేజర్ కాశీనాథ్ అన్నారు. మంగళవారం స్థానిక బాలాజీ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో తాండూరు, యాలాల మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసీ సభ్యులు, తల్లిదండ్రులకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల్లో అభ్యసన కౌశలాలు, నైపుణ్యం పెంపొందించడంలో భాగంగా శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ఉచితంగా వర్క్‌బుక్‌లు అందజేస్తున్నామని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న పాఠ్యాంశాలకు అనుగుణంగా వర్క్‌బుక్‌లను తయారు చేశామని చెప్పారు. ఇంటి వద్ద విద్యార్థులు వర్క్‌బుక్‌లను పూర్తి చేసేలా తల్లిదండ్రులు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కౌన్సిలర్ సంగీతాఠాకూర్, ఎంఈఓలు వెంకటయ్య గౌడ్, సుధాకర్ రెడ్డి, శిక్షణ ఫౌండేషన్ శిక్షకులు పాల్గొన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి

తాండూరు టౌన్: మెడికో విద్యార్థిని ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను ఉరితీయాలని బీజేపీ మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహు శ్రీలత డిమాండ్ చేశారు. మంగళవారం ప్రీతి చిత్రపటానికి నివాళి అర్పించిన అనంతరం ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో మహిళలు, బాలికలపై వేధింపులు పెరిగిపోతున్నాయని, మహిళలకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. దళిత, గిరిజన మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. సమాజానికి సేవ చేయాలని కలలు కంటున్న విద్యార్థులను ర్యాగింగ్, వేధింపులు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు లలిత, మహిళా మోర్చా ప్రతినిధులు ఉమ, రేణుక, లావణ్య, శృతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

దారి అడిగి.. దోపిడీ

బంగారు గొలుసు, సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దుండగులు

నవాబుపేట: బైక్‌పైన వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు.. రోడ్డు పక్కన నిలబడి ఉన్న వ్యక్తిని దారి అడిగి.. మత్తు మందు చల్లి దోపిడీ చేసిన ఘటన మమ్మదాన్‌పల్లిలో చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివ మంగళవారం రాత్రి 9 గంటల ప్రాంతంలో రోడ్డు పక్కన ఉన్న కిరాణా షాపు వద్దకు వెళ్తున్నాడు. ఈ సమయంలో ఎరుపు రంగు పల్సర్ బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు.. ఈ దారి ఎటు వెళ్తుందని ప్రశ్నించారు. శివ సమాధానం చెబుతుండగానే బైక్ వెనక కూర్చున్న వ్యక్తి ఏదో మత్తుమందు స్ప్రే చేశాడు. ఆ వెంటనే అతన్ని బైక్‌పై ఎక్కించుకుని గ్రామ శివారు వద్దకు తీసుకెళ్లారు. మెడపై కత్తిపెట్టి బెదిరించి, అతని వద్ద ఉన్న సెల్ ఫోన్, మెడలో ఉన్న తులం బంగారం గొలుసు, పర్సును లాక్కుని పారిపోయారు. ఈ సమయంలో శివ మెడపై గాయాలయ్యాయి. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రోడ్డుపై మురుగు పరుగు

వికారాబాద్ అర్బన్: మున్సిపల్ పరిధిలోని రామయ్యగూడ రోడ్డులో మురుగు నీరు రోడ్డుపై పారుతోంది. వ్యర్థ జలాల కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు పక్కనే ఇంటి నిర్మాణం చేస్తున్న ఓ వ్యక్తి.. ఇంటి వ్యర్థాలతో మురుగు కాలువను పూడ్చివేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందని, మున్సిపల్ అధికారులకు చెప్పినా.. పట్టించుకోవడం వాహనదారులు ఆరోపిస్తున్నారు. మురుగు కాలువలో కూరుకపోయిన వ్యర్థాలను తొలగిస్తే సమస్య తీరుతుందని, వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విజ్ఞానమే సైన్స్‌కు మూలం

విషయ పరిజ్ఞానం పెరుగుతుంది

- జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యావంతులు
- సీవీ రామన్ చిత్రపటానికి నివాళి అర్పించిన అధ్యాపక బృందం



పూడూరు: ఎన్కేపల్లి మోడల్ స్కూల్‌లో విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన తిలకిస్తున్న ఎంఈఓ

పూడూరు: ప్రపంచానికి సైన్స్ వినియోగం గురించి తెలిపిన మహనీయుడు సీవీ రామన్ అని, సైన్స్ పరంగా ఎంతో అభివృద్ధి సాధించామని ఎంఈఓ హరిశ్చందర్ అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల్లో సీవీ చిత్రపటాలకు నివాళి అర్పించారు. విద్యార్థులు వివిధ వైజ్ఞానిక ప్రదర్శనలు చేశారు. అనంతరం క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ.. సీవీ రామన్ జీవిత చరిత్రను, నిత్యజీవితంలో సైన్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: విజ్ఞానమే సైన్స్‌కు మూలమని ఉపాధ్యాయులు అన్నారు. బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లోని పలు పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర వెంకటరామన్ (సీవీ రామన్) చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించారు. ఇందులో హెచ్‌ఎం నెహ్రూ చౌహాన్, ఉపాధ్యాయులు వెంకటయ్య, సీఆర్‌పీ శివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలకు రూపకర్తలుగా..

తాండూరు టౌన్: జాతీయ వైజ్ఞానిక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని విద్యా సంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు పలు అంశాలపై స్వతహాగా ఎగ్జిబిట్లు తయారు చేసి ప్రదర్శించారు. తయారీ విధానం, వాటి ఉపయోగాలపై వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా సెయింట్ మేరీస్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు సివి రామన్, తదితర శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకుని, చిన్ననాటి నుంచే సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలని, భావితరాలకు ఉపయుక్తంగా ఉండే కొత్త ఆవిష్కరణలకు రూపకర్తలుగా మారాలన్నారు.



కుల్కచర్ల: కేవీఎం పాఠశాలలో.. ఎంఈఓ హబీబ్ అహ్మద్



కొడంగల్ రూరల్‌లో.. బాలాజీ కేజీ ఉన్నత పాఠశాలలో..



తాండూరు టౌన్‌లో.. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ విజయలక్ష్మి